క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో 'ఇంటింటికీ రామాయణం'



మురమండలో రామాయణం గొప్పతనాన్ని వివరిస్తున్న మహిళలు

కడియం: నిత్యం రామనామ స్మరణతో జీవితం సార్థకమవుతుందని సేకరణ, వితరణ, ఆత్మహితిక కేంద్ర విభాగం ప్రతినిధి ఎ.రాము అన్నారు. ఆ సంస్థ ఆధ్వర్యంలో గురువారం మురమండలో ఇంటింటికీ రామాయణం అనే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటికీ వెళ్లి రామాయణం గొప్పతనాన్ని వివరించారు.

ఆలయంలో ప్రత్యేక పూజలు

కడియం: దుళ్లలోని భ్రమరాంబికా సమేత అగస్త్యేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. శైవాగమ పండితుడు బాదంపూడి సత్యనారాయణ శర్మ పర్యవేక్షణలో వేద పండితులు ఈకార్యక్రమంలో పాల్గొన్నారు. పెద్ద ఎత్తున భక్తులు హాజరై, స్వామివారిని దర్శించుకున్నారు.

వృద్ధులకు పండ్ల పంపిణీ



వృద్ధులకు పండ్లు పంపిణీ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

రాజమహేంద్రవరం సిటీ: దేశంలోని ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేసేందుకు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ కంకణం కట్టుకున్నారని డీసీసీ అధ్యక్షుడు డాక్టర్ టీకే విశ్వేశ్వరరెడ్డి అన్నారు. గౌతమీ జీవ కారుణ్య సంఘంలోని అనాథ వృద్ధుల ఆశ్రమంలో గురువారం రాహుల్ గాంధీ పుట్టిన రోజు వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పట్నాల శ్రీనివాస్, బెజవాడ రంగారావు, దేవత సుధాకర్, జేటీ రామారావు పాల్గొన్నారు.

గోదారి తీరం.. కాలుష్యమయం

- నదిలో పేరుకుపోయిన చెత్త
- ఘాట్లలో స్నానం చేయలేని పరిస్థితి
- దోమల నివారణకు చర్యలు శూన్యం



కోటిలింగాలరేవు వద్ద గోదావరిలో కనిపిస్తున్న చెత్త



అపర కర్మలు చేసే చోట చెత్త కుప్ప



నగరంలోని ఓ మేజర్ డ్రైనేజీ దుస్థితి

సీటీఆర్ఐ: చారిత్రకంగా, సాహిత్య పరంగా రాజమహేంద్రవరానికి ఎంతో ప్రాధాన్యం ఉంది. ఎందరో మహానుభావులు ఈ నేలపై తిరిగి, ప్రజలకు ఎన్నో విలువైన సేవలు అందించారు. రాజమహేంద్రవరం అనగానే ముందుగా గుర్తుకువచ్చేది పవిత్ర గోదావరి. నగరంలోని పుష్కరాల, కోటిలింగాల రేవులకు ఎక్కడి నుంచో ప్రజలు తరలివచ్చి పుణ్య స్నానాలు ఆచరిస్తారు. ఇంత గొప్ప చరిత్ర ఉన్న నగరం ఇప్పుడు చెత్తమయంగా మారింది. గోదావరి తీరంతో పాటు నగరంలో ఎక్కడ చూసినా చెత్తకుప్పలే దర్శనమిస్తున్నాయి. ముఖ్యంగా కోటిలింగాలరేవు పూర్తిగా చెత్తతో నిండిపోయింది. ఇక్కడ కర్మకాండలు జరిపించడానికి దేశం నలుమూలల నుంచి ప్రజలు వస్తారు. అంతే కాకుండా ఇక్కడ వెలిసిన కోటిలింగేశ్వర స్వామి ఆలయం ఎంతో ప్రసిద్ధి చెందింది.

ఎక్కడి చెత్త అక్కడే....

నగరంలో రోజుకు సుమారు 160 మెట్రిక్ టన్నుల చెత్త విడుదల అవుతోంది. దీనిలో పొడిచెత్త సుమారు 40 మెట్రిక్ టన్నులు ఉంటుంది. తడి, పొడి చెత్తను వేరు చేసే ప్రక్రియ సవ్యంగా సాగడం లేదు. స్వచ్ఛ సర్వేక్షణ్‌లో భాగంగా ఇంటింటా తడి, పొడి చెత్తలను సేకరించాలి. తడి చెత్తతో సేంద్రియ ఎరువు తయారు, పొడి చెత్తను రీసైక్లింగ్ చేయాలి. దీనిలో భాగంగా గతంలో నగరంలో ఎనిమిది చోట్ల కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఎంతో అట్టహాసంగా ప్రారంభించిన ఈ విధానం క్రమంగా మూలకు చేరింది. సేంద్రియ ఎరువు ప్రయోజనాలను సైతం క్షేత్రస్థాయిలోకి తీసుకెళ్లలేకపోయారు. ఇంటింటా చెత్త సేకరణలో కూడా లోపాలున్నాయి. వాస్తవానికి ఇంటింటా వెళ్లాల్సిన వాహనం కొన్ని చోట్ల వీధుల్లో ఓ చోటుకు పరిమితం అవుతోంది. నివాసితులు అక్కడకు తీసుకెళ్లి చెత్తను వేయాల్సిన పరిస్థితి ఏర్పడింది.

నామమాత్రంగా ఫాగింగ్

నగరంలో సుమారు 97,840 గృహాలున్నాయి. 630 కిలోమీటర్ల మేర కాలువల వ్యవస్థ విస్తరించింది. ప్రతి సచివాలయం పరిధిలో ఆయా డివిజన్లలో నామమాత్రంగా ఫాగింగ్ చేస్తున్నారు. ఇందుకోసం కేవలం ఎనిమిది యంత్రాలు మాత్రమే ఉన్నాయి. మరికొన్ని అంతంత మాత్రంగానే పనిచేస్తున్నాయి. సీజన్‌లో ప్రతి డివిజన్‌లో రెండు రోజులకు ఒక్కసారైనా ఫాగింగ్, స్ప్రేయింగ్ జరగాలి. దోమల నివారణకు మందు కోసం ఏటా రూ.2 లక్షల నుంచి రూ.3 లక్షల వరకూ ఖర్చు చేస్తున్నా పూర్తి స్థాయిలో స్ప్రేయింగ్, ఫాగింగ్ జరగడం లేదు.

వ్యాధుల కాలం

వర్షాకాలం మొదలైంది. సీజనల్ వ్యాధులు విజృంభించే అవకాశం ఉంది. మొత్తం 50 డివిజన్ల పరిధిలో సుమారు 36 మురికి వాడలు ఉన్నాయి. కనీసం లక్షన్నర మందికి పైగా అక్కడ నివాసం ఉంటున్నారు. సీజన్‌లో ఈ ప్రాంతాల్లో పారిశుధ్యాన్ని మెరుగుపర్చాలి.

ఆర్యాపురం బ్యాంకును అగ్రగామిగా తీర్చిదిద్దుతాం



విలేకరులతో మాట్లాడుతున్న బ్యాంక్ చైర్మన్ చల్లా శంకరరావు

రాజమహేంద్రవరం సిటీ: ది ఆర్యాపురం కో ఆపరేటివ్ అర్బన్ బ్యాంకును రాష్ట్రంలో అగ్రగామిగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో పనిచేస్తున్నామని ఆ బ్యాంకు చైర్మన్ చల్లా శంకరరావు అన్నారు. నగరంలోని బ్యాంక్ ప్రధాన కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 22.45 శాతానికి చేరుకున్న ఎన్‌పీఏను 5.71 శాతానికి తగ్గించామన్నారు. తమ పాలక మండలి అధికారం చేపట్టిన 11 నెలల్లో రూ.115 కోట్లు ఉన్న బకాయిలను రూ.95 కోట్లు వసూలు చేశామన్నారు. సాఫ్ ఆంక్షలను తొలగింపచేసి, మెంబర్లకు ఆగిపోయిన డివిడెండ్‌ను 2024 -25 సంవత్సరానికి పునరుద్ధరించి, 12 శాతం డివిడెండ్ ప్రకటించామన్నారు. తొమ్మిది నెలల్లో ఖర్చులు పోను రూ.12.54 కోట్ల నికర లాభం వచ్చిందన్నారు. సమావేశంలో బ్యాంకు వైస్ చైర్మన్ పోలాకి పరమేశ్వరరావు, డైరెక్టర్లు యెనుముల రంగారావు (రంగబాబు), పిల్లి శ్యామ్ కుమార్, పడాల శ్రీనివాసరావు, యర్రమోతు ధర్మరాజు, యాళ్ల వెంకట్రావు, ముగిది శ్రీనివాసరావు(కాపు), కప్పల సూర్య ప్రకాశరావు, నీలపాల సూర్యసత్యనారాయణ పాల్గొన్నారు.

యోగాంధ్రను విజయవంతం చేయాలి



రామలింగేశ్వర్, అడిషనల్ కమిషనర్

రాజమహేంద్రవరం సిటీ: అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్ర, శనివారాల్లో నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించే యోగాంధ్ర కార్యక్రమాలను విజయవంతం చేయాలని అడిషనల్ కమిషనర్ పీవీ రామలింగేశ్వర్ అన్నారు. ఆయన గురువారం మాట్లాడుతూ లాలాచెరువు సూర్య నమస్కారాల పార్కు, శేషయ్య మెట్ట సుబ్రహ్మణ్య మైదానం, క్వారీ మార్కెట్‌లోని శివాలయం సమీపంలో శుక్రవారం మాక్ డ్రిల్ నిర్వహిస్తామన్నారు. యోగా దినోత్సవంపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించడం., యోగాంధ్ర కార్యక్రమంలో వారిని ప్రజలను భాగస్వామ్యం చేయడం ఈ కార్యక్రమ ముఖ్యఉద్దేశమన్నారు. అలాగే 21న విశాఖలో జరిగే ప్రధానమంత్రి కార్యక్రమాన్ని నగరంలోని అన్ని యోగాంధ్ర కార్యక్రమాల వద్ద ప్రసారం చేస్తామన్నారు.

యోగాంధ్రపై సమీక్ష

కడియం: ఈ నెల 21వ తేదీన జరగనున్న యోగాంధ్ర కార్యక్రమంపై గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సమీక్షించారు. విద్యాశాఖ, డ్వాక్రా, ఆరోగ్య, అంగన్‌వాడీ, పంచాయతీ సిబ్బంది ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఎంపీపీ వెలుగుబంటి సత్యప్రసాద్ ముఖ్యఅతిథిగా పాల్గొని ఏర్పాట్లపై సమీక్షించారు. కార్యక్రమంలో ప్రత్యేకాధికారి పి.సుజాత కుమారి, ఎంపీడీవో కె.రమేష్, ఎంఈవోలు మణికుమార్, నాగేశ్వరరావు, హెల్త్ ఆఫీసర్ మణిజ్యోత్స్న తదితరులు పాల్గొన్నారు.

రెడ్‌క్రాస్ సొసైటీకి రూ.5,44,450 అందజేత



గన్ని మహాలక్ష్మికి జీవిత సభ్యత్వ నమోదును అందిస్తున్న కలెక్టర్ ప్రశాంతి

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీలో సభ్యత్వ నమోదుకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలని కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. సొసైటీలో 332 మంది డ్వాక్రా మహిళలు జీవితకాల సభ్యత్వం తీసుకోవడం ఎందరికో స్ఫూర్తినిస్తోందని చెప్పారు. డీఆర్‌డీఏ పీడీ ఎన్‌వీవీఎస్ మూర్తి ఆధ్వర్యాన రూ.5,44,450 చెక్కును రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యురాలు డాక్టర్ గన్ని మహాలక్ష్మికి కలెక్టర్ కలెక్టరేట్‌లో గురువారం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, రెడ్‌క్రాస్ సొసైటీ కార్యకలాపాల్లో అన్ని వర్గాల ప్రజలనూ స్వచ్ఛందంగా భాగస్వాముల్ని చేసేలా సభ్యత్వ నమోదు చేయాలని సూచించారు. స్వయం సహాయక సంఘాల మహిళలు 332 మంది రూ.3,65,200 చెల్లించి, జీవిత కాల సభ్యత్వం తీసుకున్నారని చెప్పారు. అదే సమయంలో రెడ్‌క్రాస్ కార్యకలాపాలకు తమ వంతుగా రూ.1,79,250 ఆర్థిక సహాయం అందజేశారని తెలిపారు.

యోగా.. దినచర్య కావాలి



యోగా కార్యక్రమంలో పాల్గొన్న డీఆర్‌ఓ సీతారామమూర్తి తదితరులు

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): యోగాను దినచర్యగా అలవరచుకోవాలని డీఆర్‌ఓ సీతారామమూర్తి అన్నారు. జిల్లా క్రీడాసాధిర సంస్థ, జిల్లా ఆయుష్ శాఖల సంయుక్త ఆధ్వర్యాన స్థానిక గ్రాంట్ ట్రంక్ రోడ్డులో గురువారం నిర్వహించిన యోగా కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ మాట్లాడుతూ, యోగా సాధనను జీవన విధానంగా స్వీకరిస్తే శారీరక, మానసిక ఆరోగ్యం చేకూరుతుందని చెప్పారు.

శృంగార వల్లభునికి స్వర్ణ నేత్రాలు



బంగారు నేత్రాలు అందజేస్తున్న దాతలు

పెద్దాపురం: తొలి తిరుపతి గ్రామంలో స్వయంభువుగా వెలసిన శృంగార వల్లభ స్వామికి నామన పార్వతి (రాజమహేంద్రవరం) గురువారం సుమారు 17 గ్రాముల బంగారు నేత్రాలు సమర్పించారు. దీంతో పాటు, ఆలయంలో నిత్యాన్నదానానికి రూ.9 వేల విరాళం అందజేశారని ఆలయ ఈఓ వడ్డి శ్రీనివాస్ తెలిపారు. దాతలను అర్చకులు పెద్దింటి పురుషోత్తమాచార్యులు, నారాయణాచార్యులు ఆశీర్వదించి, స్వామి వారి చిత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ మొయిళ్ల కృష్ణమూర్తి కూడా పాల్గొన్నారు.

ఇగ్నో స్టడీ సెంటర్ సందర్శన

కంబాలచెరువు: విశాఖపట్నం ఇందిరాగాంధీ జాతీయ ఓపెన్ యూనివర్సిటీ (ఇగ్నో) ప్రాంతీయ సంచాలకులు డాక్టర్ ఈ.కృష్ణారావు గురువారం ఆర్ట్స్ కళాశాలలోని ఇగ్నో స్టడీ సెంటర్‌ను సందర్శించారు. ఈ ఏడాదిలో జరుగుతున్న టర్మ్ ఎండ్ పరీక్షల నిర్వహణకు సంబంధించి చేసిన ఏర్పాట్లను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. స్టడీ సెంటర్‌లో నిర్వహిస్తున్న పత్రాలు, నమోదు రికార్డులను పరిశీలించి అభినందించారు. రీజినల్ సెంటర్ తరఫున కెమిస్ట్రీ, అనాలిటికల్ కెమిస్ట్రీ, జువాలజీ, జియో ఇన్ఫర్మేటిక్స్, కంప్యూటర్ సైన్స్ తదితర పీజీ కోర్సులు, బీసీఏ కోర్సును ప్రారంభించాలనే ఆలోచన ఉందని ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రామచంద్రరావుకు తెలిపారు. అలాగే కెమిస్ట్రీ, కంప్యూటర్ సైన్స్, జువాలజీ, జియాలజీ శాఖల శాఖాధిపతులతో సమావేశమయ్యారు. కళాశాలలోని డిజిటల్ ల్యాబ్స్ డిజీ హబ్, టెక్నోస్ఫియర్, రిమోట్ సెన్సింగ్ ల్యాబ్‌ను సందర్శించి సంతృప్తి వ్యక్తం చేశారు.

తల్లులకు కూటమి ప్రభుత్వం మోసం

కంబాలచెరువు: తల్లికి వందనం పేరుతో కూటమి ప్రభుత్వం తల్లులను మోసం చేసిందని పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.కిరణ్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో విమర్శించారు. అధికారంలో రాకముందు ఇంట్లో ఎంతమంది విద్యార్థులుంటే అంతమందికి రూ.15 వేల చొప్పున ఇస్తామని ప్రచారం చేశారన్నారు. అధికారంలోకి వచ్చిన తర్వాత మొదటి విద్యా సంవత్సరం ఈ మొత్తాన్ని తల్లుల ఖాతాల్లో జమ చేయలేదని, రెండో ఏడాది రూ.2 వేలు ఎగనామం పెట్టి, రూ.13 వేలు మాత్రమే జమ చేస్తున్నారని దుయ్యబట్టారు. తల్లికి వందనం అమలు సమయంలో విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ జీఓ నంబర్ 26 తీసుకుని వచ్చి తల్లులకు ద్రోహం చేస్తున్నారని మండిపడ్డారు. సాంఘిక సంక్షేమ హాస్టళ్ల మరమ్మతులకు విడుదల చేసిన నిధులను దారి మళ్లించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అధికారం చేపట్టి ఏడాది పూర్తయినా కొత్త హాస్టళ్ల నిర్మాణం ఎక్కడా జరగలేదన్నారు. హాస్టళ్లకు వేసే రంగులో తక్కువ పాళ్లు కలిపి నిధులు దుర్వినియోగం చేస్తున్నారని కిరణ్‌కుమార్ ఆరోపించారు.

ఉత్సాహంగా జిల్లా స్థాయి యోగాంధ్ర పోటీలు



యోగాంధ్ర పోటీలను పరిశీలిస్తున్న డీఈవో వాసుదేవరావు

కంబాలచెరువు: అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఎస్‌కేవీటీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గురువారం జిల్లా స్థాయి యోగాంధ్ర పోటీలు నిర్వహించారు. ఎనిమిది విభాగాల్లో ఈ పోటీలు జరిగినట్టు జిల్లా పాఠశాల విద్యాశాఖ అధికారి కంది వాసుదేవరావు తెలిపారు. 19 మండలాల నుంచి విజేతలుగా నిలిచిన వారిని జిల్లా స్థాయికి ఎంపిక చేశామన్నారు. యోగా ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరిస్తూ జరిగిన ఈ కార్యక్రమానికి జిల్లా వ్యాప్తంగా స్పందన లభించిందన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎంవీఎం సుబ్రహ్మణ్యం, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

29న ఎస్సీ కమిషన్ చైర్మన్ జవహర్‌కు సన్మానం

సీటీఆర్ఐ: రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ కేఎస్ జవహర్‌కు ఈ నెల 29వ తేదీ సాయంత్రం నాలుగు గంటలకు జాంపేటలోని హోటల్ ఆనంద్ ఏజెన్సీ పందిరి హాల్లో సన్మానం చేయనున్నట్టు దళిత ఐక్యవేదిక నాయకులు తెలిపారు. గణేష్ చౌక్‌లోని ప్రెస్‌క్లబ్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జిల్లా దళిత ఐక్యవేదిక సన్మాన కమిటీ కన్వీనర్ బోయిలపల్లి సుందరయ్య ఈ విషయం తెలిపారు.

ఆకుల వీర్రాజుకు ప్రముఖుల పరామర్శ



ఆకుల ఈశ్వరమ్మ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న జెడ్పీ చైర్మన్ వేణుగోపాలరావు

అల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా సహకార కేంద్ర బ్యాంకు (డీసీసీబీ) మాజీ చైర్మన్ ఆకుల వీర్రాజును గురువారం పలువురు ప్రముఖులు పరామర్శించారు. వీర్రాజు మాతృమూర్తి ఈశ్వరమ్మ ఇటీవల స్వర్గస్తులైన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా ఈశ్వరమ్మ చిత్రపటానికి జిల్లా పరిషత్ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు, మాజీ వైస్ ఎంపీపీ నక్కా రాజబాబు తదితరులు పుష్పాంజలి ఘటించారు. మాజీ డీసీఎంఎస్ డైరెక్టర్ వెలుగుబంటి అచ్యుతరామ్, వైఎస్సార్ సీపీ మైనార్టీ సెల్ అధికార ప్రతినిధి మీర్జా మౌలా అలీ, మాజీ సర్పంచ్‌లు అత్తిలి భీమశంకరం, మెట్ల ఏసుపాదం, మాజీ కార్పొరేటర్లు ఇసుకపల్లి శ్రీనివాస్, బొంతా శ్రీహరి, వాకచర్ల కృష్ణ, మంచాల బాబ్జీ, మాజీ ఉపసర్పంచ్‌లు చెరుకూరి సత్యనారాయణ, షేక్ మౌలాలీ, ఆర్యాపురం అర్బన్ బ్యాంక్ మాజీ డైరెక్టర్ కొల్లిమళ్ల రఘు తదితరులు పరామర్శించిన వారిలో ఉన్నారు.